క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీఎస్ఐ చర్చి, ఆఫ్ హోమ్ ఆసియా వారి సాయంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఆనంద్, రామస్వామి బీఆర్ఎస్ నాయకులు సదానందం, తాటి కృష్ణయ్య, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న తహసీల్దార్

రామాయంపేట(మెదక్): నార్సింగ్ మండలం భీమ్రావుపల్లి గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని శనివారం నార్సింగ్ తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బోయిన భూషణం, నాయకులు హరిదాస్ గోవర్ధన్‌ఉన్నారు.

బాల్యవివాహాలు చేయొద్దు

కౌడిపల్లి(నర్సాపూర్): బాల్యవివాహాలు చేయొద్దని కార్పెడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మమత తెలిపారు. శనివారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో డ్వాక్ర మహిళలకు బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్యవివాహాలతో ఇబ్బందులు ఏర్పాడుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, సీసీలు, డ్వాక్ర మహిళలు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డిని కలిసిన శశిధర్ రెడ్డి



పాపన్నపేట(మెదక్): భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని శనివారం మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కలిశారు. కాంగ్రెస్ పార్టీలో కలిసిన తర్వాత మర్యాద పూర్వకంగా కలిసినట్లు చెప్పారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మనోధైర్యం



బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మార్షల్ ఆర్ట్స్‌తో విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందుతుందని నవభారతి పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్‌గౌడ్, కరాటే మాస్టర్ పోచయ్య అన్నారు. సంగారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వారియర్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ–ఇండియా, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్–ఫూ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో బ్లాక్ బెల్ట్ సాధించిన చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట నవ భారతి పాఠశాల విద్యార్థులు వివేక్ వర్ధమాన్ గౌడ్, భవజ్ఞ, ప్రణయ్‌తేజ గౌడ్‌లను హెచ్ఎం శ్రీకాంత్‌గౌడ్, మాస్టర్ పోచయ్య ఘనంగా సన్మానించారు. పాఠశాల సిబ్బంది మహేశ్, నిరంజన్, సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ మల్లేశ్ అధ్యక్షతన శనివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఉప సర్పంచ్ తుమ్మల రాజు, వార్డు సభ్యులు, కార్యదర్శి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మితే కఠిన చర్యలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమ మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మనోహరాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అక్రమ మద్యం అమ్మితే వారిపై చర్యలు తప్పవని, అమ్మిన వారిపై తమకు సమాచారమివ్వాలన్నారు.

హాస్టల్ ఉన్నా.. విద్యార్థులు సున్నా

- వసతి గృహాలకు తగ్గిన ఆదరణ
- ప్రవేశాలపై పట్టించుకోని అధికారులు



విద్యార్థినులు లేక మూతపడ్డ ఎస్సీ బాలికల హాస్టల్

అల్లాదుర్గం(మెదక్): నిరుపేద బాలికలకు విద్యనందించే సంక్షేమ హాస్టళ్లు అధికారుల నిర్లక్ష్యంతో మూతపడుతున్నాయి. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఎస్సీ బాలికల వసతి గృహంలో 10 గదులు, 120 మంది విద్యార్థులుండేందుకు అన్ని సౌకర్యాలున్నాయి. కానీ కరోనాతో విద్యార్థులు హాస్టళ్లలో చేరకపోవడం, అటు తర్వాత విద్యార్థినులను వసతి గృహల్లో చేర్పించేందుకు అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. హాస్టల్‌లో సిబ్బంది, వార్డెన్‌లు సహితం లేక పోవడం, ఇన్‌చార్జ్‌లతో నెట్టుకురావడంతో సంక్షేమ హాస్టళ్లకు స్వస్తి పలికే దుస్థితి నెలకొంది. ఇది అల్లాదుర్గం ఎస్సీ బాలికల హాస్టల్ దుస్థితి.

- అల్లాదుర్గంలో నాలుగు దశాబ్దాల క్రితం పది గదులతో ఎస్సీ బాలికల వసతి గృహం నిర్మించగా, 120 విద్యార్థులుండేందుకు సకల సౌకర్యాలున్నాయి.
- కరోనాతో హాస్టళ్లు మూతపడటం, తర్వాత ప్రారంభమైన విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. విద్యార్థినులు హాస్టల్‌లో చేరకపోవడం, సిబ్బంది, అధికారులు చేర్పించేందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో హాస్టల్ మూతపడింది.
- గత సంవత్సరం 15 నుంచి 20 మంది విద్యార్థులే ఉన్నారు. హాస్టల్‌లో పెద్ద పాము రావడంతో ఉన్న విద్యార్థినులు ఇళ్లకు వెళ్లిపోయారు. భవనం పెద్దగా ఉండటంతో విద్యార్థినుల సంఖ్య కూడా తక్కువ ఉండటంతో హాస్టల్‌లో ఉండేందుకు బాలికలు భయపడ్డారు.
- పాఠశాలకు కిలోమీటర్ దూరంలో హాస్టల్ ఉండటంతో విద్యార్థినులు రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు ఉంది. ఆర్టీసీ అధికారులు బాలికలకు ఉచిత పాస్ ఇస్తే హాస్టల్ విద్యార్థులకు ఉపయోగపడటంతో పాటు బాలికలు హాస్టల్‌లో అడ్మిషన్ అయ్యే అవకాశం ఉంది.
- ఈ ప్రాంతంలో చాలా మంది ఎస్సీ బాలికలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఈ విద్యార్థులను హాస్టల్‌లో చేర్పించేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. ఇన్‌చార్జ్ వార్డెన్‌లు, సిబ్బంది తమకేమి సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు.
- ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమైన విద్యార్థినులు రావడం లేదని జిల్లా స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చి హాస్టల్ మూతపడేలా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఈ సంఘటనపై జిల్లా అధికారులు విచారణ జరపాలని దళిత సంఘం నేతలు కోరుతున్నారు.
- ప్రస్తుతం ప్రైవేట్ సిబ్బంది ఒకరు ఉదయం వచ్చి హాస్టల్ తెరిచి, సాయంత్రం మూసేస్తూ వెళ్తున్నారు.
- ఈ విషయంపై ఇన్‌చార్జ్ వార్డెన్ శాంతను ప్రశ్నించగా.. ఎవరు అడ్మిషన్ కాకపోవడంతో హాస్టల్ నడపలేమని జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు చెప్పారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

డీఎస్పీ సైదులు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సైదులు

పెద్దశంకరంపేట(మెదక్): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదపడతాయని మెదక్ డీఎస్పీ సైదులు అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో వ్యాపారి బాయికాడి నర్సింలు తన దుకాణంతో పాటు ఇంటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, డీఎస్పీ వాటిని ప్రారంభించారు. గతంలో నర్సింలు దుకాణంలో దొంగతనం జరగగా అతడు సొంతంగా 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నాడు. దీంతో డీఎస్పీ అతడిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సొంతంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు తగ్గుతాయన్నారు. ప్రజలు స్వచ్ఛందగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు తగ్గడంతో పాటు దొంగతనాలు జరగకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళిపంతులు, ఎస్ఐ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామికి ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

కమాన్‌పూర్(మంథని): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ఆదివరాహస్వామికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ఇనగంటి ప్రేమలత పద్మకు స్వామి తీర్థప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. అనంతరం ఎంపీపీ లక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, ఉప సర్పంచ్ సాయి, ఆలయ డైరెక్టర్లు పిడుగు అంజి, కొలిపాక లక్ష్మి ఎమ్మెల్యేను సన్మానించారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

నర్సాపూర్ రూరల్: మండలంలోని ఖాజీపేట గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మండల పశు వైద్యాధికారి సామిత్ తెలిపారు. శనివారం కాజీపేట సర్పంచ్ హేమలత ఆధ్వర్యంలో గ్రామానికి మంజూరైన 12 యూనిట్ల లబ్ధిదారులకు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘం చైర్మన్ శ్రీశైలం యాదవ్, మదన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్‌ల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో విద్యార్థులకు జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా ఆర్థిక సహకారంతో ఉచితంగా బస్‌పాస్‌లను సర్పంచ్ పత్రాల శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. శనివారం మండల కేంద్రం శివ్వంపేట ప్రభుత్వ పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు టీఎస్‌ఆర్‌టీసీకి జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా ఏడాదికి సరిపడ డబ్బులు చెల్లించి ఉచిత బస్‌పాస్‌లు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు సర్పంచ్ పంపిణీ చేశారు. విద్యార్థుల అభివృద్ధికి జెడ్పీటీసీ కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, పాలకమండల సభ్యులు కొండల్, ఆర్టీసీ అధికారులు యాదగిరి, కదీర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన యాప్‌లపై అవగాహన



యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం రోజున వీఓఏలకు సెర్ప్, ఎస్ఆర్ఎల్ఎం అప్లికేషన్‌లపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు సంఘాల అకౌంటింగ్ యాప్‌లో నిర్వహించాల్సిన సభ్యురాళ్ల ఇన్సూరెన్స్, ఓబీ వివరాలు, సంఘాల ప్రత్యక్ష సమావేశాలు, లావాదేవీలు, బ్యాంకు లింకేజీ, సభ్యురాలి కుటుంబ జీవనోపాధి, సూక్ష్మ రుణ ప్రణాళిక, కొత్త వ్యాపారాలు లేదా ఉన్న వ్యాపారాల అభివృద్ధి గురించి వివరించారు. కంప్యూటర్లలోని నూతన యాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటస్వామి, సీటీఓ ఆడిటర్ నాగరాజు, సీసీలు స్వరూప, లక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ స్వామి, గ్రామ సంఘాల వీఓఏలు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార వేత్తలుగా మారాలి

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళా సంఘాల సభ్యులు వ్యాపార వేత్తలుగా మారాలని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం కౌడిపల్లి ఐకేపీ కార్యాలయంలో డ్వాక్ర మహిళలకు ఆర్థిక అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం సంగమేశ్వర్, సీసీలు నాగరాజు, నర్సింలు, బాబు మహిళలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కళాకారుడు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని వెలుగు వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజ్ నందు విద్యార్థులకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో షీ టీమ్, యాంటీ ఉమెన్ ట్రాఫిక్ యూనిట్ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల జరిగే అనర్థాలపై, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, పోలీస్ చట్టాలపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి, అధ్యాపకులు చంద్రలేఖ, కళా, మహేశ్, దయాకర్, ఏహెచ్‌టీయూ ఎస్ఐ మల్లయ్య, కళాబృందం సభ్యులు, కానిస్టేబుల్ సురేందర్, షీటీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం పెద్దశంకరంపేటలో 46 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు, మధ్యాహ్న భోజన కార్మికులకు చెక్కులతో పాటు ధూపదీపనైవేద్యంలో ఎంపికైన వారికి ధృవపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళిపంతులు, సర్పంచ్‌లు సత్యనారాయణ, కుంట్ల రాములు, నరేశ్, ప్రకాశ్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ఎంపీటీసీలు దత్తు, వీణసుభాశ్‌గౌడ్, స్వప్నరాజేశ్,రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, తహసీల్దార్ చరణ్‌సింగ్, ఏపీఎం గోపాల్, నాయకులు శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్, మల్లేశం, అంజయ్య, అశోక్, సూర్యప్రకాశ్, పున్నయ్య పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

టేక్మాల్(మెదక్): ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ తెలిపారు. శనివారం టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఈ కేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా విడుదల చేస్తున్న 14వ విడత డబ్బులు తమ ఖాతాల్లో జమ చేయబడునని సూచించారు. మండలంలో తొమ్మిది వందలకు పైగా రైతులు కేవైసీ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ కేవైసీ చేయించని పక్షంలో రైతుల ఖాతాలను పూర్తిగా తొలగించబడుతుందన్నారు. గ్రామాల్లోని రైతులు అందరూ అవగాహన కలిగి ఉండి ఈనెల 30వ తారీకు వరకు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అవగాహన కలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మి తదితరులు ఉన్నారు.

వరిగుంతం- కొల్చారం రోడ్డుకు మోక్షం

సాక్షి ఎఫెక్ట్..

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రానికి వెళ్లే పది గ్రామాల ప్రజలకు పదిహేను ఏళ్లకు పైగా నరకాన్ని చూపెట్టిన వరిగుంతం – కొల్చారం ప్రధాన రోడ్డుకి ఎట్టకేలకు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ రహదారిపై కనీసం ఆటో కూడా నడవని దుస్థితి. పూర్తిగా కంకర తేలి, గుంతలు పడి కనీసం ద్విచక్ర వాహనంపై వెళ్లలంటే ఒళ్లంతా హూనం కావాల్సిందే. లేదంటే పోతంశెట్టి పల్లి చౌరస్తా మీదుగా రెండు బస్సులు మారి వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో దూరాబారం పెరగడం, అదనపు ఖర్చు ప్రజలను ఇబ్బందులు గురిచేస్తూ వచ్చింది. ఈ రహదారి మరమత్తుల కోసం ఇక్కడి ప్రజలు, ప్రతిపక్షాలు ఎన్నో పోరాటాలు చేశారు. నరకప్రాయంగా మారిన రహదారిపై సమయం వచ్చినప్పుడల్లా సాక్షి సైతం వరస కథనాలతో ప్రజల తరపున తన గలాన్ని వినిపిస్తూ వచ్చింది. నిధులు మంజూరై ఏడుసార్లు టెండర్లు నిర్వహించినా.. రోడ్డు మరమ్మతు చేపట్టేందుకు గుత్తేదారు సైతం ముందుకు రాలేదు. ఎట్టకేలకు ఇప్పటికీ రోడ్డు మరమ్మతుల్లో కదలిక రావడం, ప్రస్తుతం రోడ్డు మరమ్మత్తు పనులను అధికారులు మొదలుపెట్టారు. ఎంఆర్ఆర్ నిధుల కింద దెబ్బతిన్న 2.6 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం రూ.1.05 కోట్లను కేటాయించి పనులను ప్రారంభించారు. ఈ విషయం పంచాయతీరాజ్ ఏఈ 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదేశాలతో రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజా రవాణాకు అనుకూలంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్ ఏఈ ఇర్ఫాన్

ముదిరాజ్‌లను దూషించడం సరికాదు



నర్సాపూర్: ఫ్లెక్సీని దహనం చేస్తున్న ముదిరాజ్ నాయకులు

నర్సాపూర్: ముదిరాజ్ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందున ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీని శనివారం చౌరస్తా వద్ద ముదిరాజ్ నాయకులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు మల్లేశ్, రమణరావు, నర్సింలు, ఉదయ్ తదితరులున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో ఎమ్మెల్సీ కౌషిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసిన వారిలోశారు. ముదిరాజ్ సంఘం నాయకులు దిగంబర్, శాఖయ్య, మల్లేశం, రాయగిరి, వీరయ్య, లక్ష్మణ్, దుర్గయ్య, రాజు, నరహరి, రంగయ్య, నర్సింలు, సందీప్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): ముదిరాజ్‌లకు క్షమాపన చెప్పాలని మండల ముదిరాజ్‌ల సంఘం సభ్యులు ఏఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్నయ్య, సభ్యులు రవీందర్, శ్రావణ్, శంకరయ్య, సర్వేష్, రాములు, భాస్కర్ తదితరులున్నారు.

పాపన్నపేట(మెదక్): ముదిరాజ్‌లకు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని పాపన్నపేట మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కిష్టయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు సత్యం, కార్యదర్శి నర్సింలు, సాయిలు, సత్యం, ఆశయ్య, చంద్రయ్య, రమణ, దుర్గయ్య, వెంకట్‌రాములు, గణేశ్, ముచ్చయ్య, దశరథ్, మల్లేశం, సాయిలు తదితరులు ఉన్నారు.

రామాయంపేట (మెదక్): ముదిరాజ్ కులస్తులను దూషించిన సంఘటనలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ముదిరాజ్ సంఘం సభ్యులు రామయంపేటలో నిరసన వ్యక్తం చేశారు. ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు ఆధ్వర్యంలో సభ్యులు బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు వారిని సముదాయించి ఆందోళన విరమింపచేశారు. ఆందోళనలో రామాయంపేట, మెదక్ మండలాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థిక సాయం**



శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాధితుడికి జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా శనివారం ఆర్థికసాయం చేశారు. మండల కేంద్రం శివ్వంపేట పేద కుటుంబానికి చెందిన మాల మల్లయ్య అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పరామర్శించి,రూ. 5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. మెరుగైన చికిత్స కోసం తనవంతు సాయం చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు నవీన్, ఖాదీర్, త్రినేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

మెదక్‌జోన్: మండలంలోని మగ్దంపూర్ గ్రామానికి చెందిన జక్కుల యాదమ్మ, యాదగిరి భార్యాభర్తలు ఇద్దరు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్ వారి కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్ నాయకుడు జయరాం రెడ్డి ద్వారా రూ.20వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉపసర్పంచ్ రజనీకాంత్, నాయకులు హనుమంత్ రెడ్డి, రాములు, మల్లేశం గిరిధర్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

◆ **రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి**

అల్లాదుర్గం(మెదక్): కొత్త పట్టాదారులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16, 2023 వరకు కొత్త పాస్ పుస్తకాలు పొందిన వారు జూలై 3 లోగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతుబంధు కోసం ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాస్ పుస్తకం, లేక తహసీల్దార్ ఆఫీస్ కాపీ, లబ్ధిదారుడి ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్‌తో వ్యవసాయ కార్యాలయంలో రైతుబంధు ఫారం నింపి సంతకం చేసి ఇవ్వాలన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): రైతుబంధు పథకంలో భాగంగా ఈ నెల 16 వరకు వచ్చిన నూతన పట్టాదార్‌లు దరఖాస్తులను స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని ఇన్‌చార్జ్ ఏఓ రాజేశ్‌కుమార్ అన్నారు.

నిజాంపేట(మెదక్): కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, రైతుబంధుకి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సతీష్ సూచించారు.

◆ **ముప్పిరెడ్డిపల్లిలో పాలవకర్గ సమావేశం బహిష్కరణ**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ ప్రభావతి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన పంచాయతీ పాలవకర్గ సమావేశాన్ని గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ.. సర్పంచ్ భర్త ఒంటెద్దు పోకడలకు పార్టీ సమావేశాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. సభ్యులను అగౌరవపర్చేలా ఆయన వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని కార్యదర్శి స్వామిగౌడ్‌ను వివరణ కోరగా పంచాయతీ పాలకవర్గం ఏర్పాటు చేయగా సర్పంచ్, వార్డు సభ్యురాలు ఒకరు మాత్రమే హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు.

◆ **ప్రొసీడింగ్ పత్రం అందజేత**



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో నాయీ బ్రహ్మణ కులస్తులకు శనివారం జిల్లా పరిషత్ నిధుల్లో భాగంగా మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ నాయీ బ్రహ్మణ సంఘానికి రూ. 5లక్షల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గర్గుల శ్రీనివాస్, జాల పోచయ్య, జీపీ స్వామి, సూర రాములు, మోహన్ రెడ్డి, నాయీ బ్రహ్మణ కులస్తులు స్వామి, సత్తయ్య, వెంకటస్వామి, రాజు, యాదగిరి, మల్లయ్య, తిరుపతి, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

◆ **అనారోగ్యంతో కోరంపల్లి ఉపసర్పంచ్ మృతి**

టేక్మాల్(మెదక్): మండలంలోని కోరంపల్లి గ్రామ ఉపసర్పంచ్ కల్లు బాగమ్మ (53) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. మండలాధ్యక్షుడు వీరప్ప, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు భాస్కర్, భూమయ్య తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతి బీఆర్ఎస్ పార్టీకి, గ్రామానికి తీరనిలోటన్నారు.

◆ **పత్తి సాగు పనులు ప్రారంభం**

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముందస్తుగా పత్తి సాగు కోసం దుక్కులు దున్ని పెట్టుకున్న రైతులు పత్తి విత్తనాలను విత్తుతున్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో 33కేవీ మేయింటెన్స్ పనుల్లో భాగంగా మండలంలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం ఉంటుందని శనివారం ఏఈ కృష్ణ తెలిపారు. దీంతో మనోహరాబాద్, కాళ్ళకల్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

◆ **కాంగ్రెస్ సోషల్‌మీడియా కో ఆర్డినేటర్‌గా నవీన్**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా మడూర్ గ్రామానికి చెందిన పెండల నవీన్‌కుమార్‌ను నియమించారు. నియామక ఉత్తర్వులు అందుకున్న నవీన్ కుమార్‌ను వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శివకుమార్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ సన్మానించారు.

◆ **పోలీస్‌స్టేషన్ తనిఖీ**



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శనివారం రామాయంపేట సీఐ లక్ష్మీబాబు తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి ఎస్ఐ సుభాష్‌గౌడ్‌కు పలు సూచనలు చేశారు.